క్లుప్తంగా

21న పల్లె నాగేశ్వర్‌రావు అభినందన సభ



కాచిగూడ: తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వర్ రావు అభినందన సభను ఈ నెల 21న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్ ప్రకటించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ బీమపాక నగేష్, జస్టిస్ పుల్లా కార్తిక్, రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌తో పాటు పలు రంగాల ప్రముఖులు, న్యాయ రంగ నిపుణులు హాజరవుతారన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

నల్లకుంట: నోయిడాలోని వీవీ గిరి నేషనల్ లేబర్ ఇనిస్టిట్యూట్ (వీవీజీఎన్ఎల్ఐ)లో ఇటీవల 4 రోజుల పాటు 'లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ తెలంగాణ స్టేట్ ట్రేడ్ యూనియన్ లీడర్స్' (ఎల్‌డీపీ టీఎస్ టీయూఎల్) శిక్షణ శిబిరం జరిగింది. నల్లకుంటకు చెందిన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంటీ. కిషోర్‌కుమార్ పాల్గొని శిక్షార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేతుల మీదుగా కిశోర్ కుమార్ సర్టిఫికెట్ అందుకోగా.. వీవీజీఎన్ఎల్ఐ డైరెక్టర్ జనరల్ అమిత్ నిర్మల్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఎంఎం. రెహమాన్, మాజీ సభ్యుడు క్రిష్ణమూర్తి, బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఎస్‌బీహెచ్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: డివిజన్‌లో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని వివిధ విభాగాలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారంపై కార్పొరేటర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు రజిత, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇమామ్, మోజన్‌సాబ్‌లకు సన్మానం



చిక్కడపల్లి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గాంధీనగర్ డివిజన్ మసీదులో షబ్బే ఖదర్ ఖురాన్‌కు తిలావత్ పూర్తయిన సందర్భంగా బుధవారం బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ మహమూద్ ఆధ్వర్యంలో ఇమామ్, మోజన్‌సాబ్‌లను సన్మానించి నగదు పురస్కారాలను అందజేశారు. సదర్‌సాబ్, గౌస్‌భాయ్, మహబూద్, ఎండీ హఫీజ్, యాసిన్, ఖమర్‌బాయ్, సల్మాన్ పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ కలుషిత నీటి సరఫరా జరగకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ రావులకు సూచించారు. ఎ.వినయ్‌కుమార్, ముత్యాలు, కృష్ణప్రసాద్, జహంగీర్‌పాషా, మున్నాబాయ్, అర్షపాషా, ఇంతియాజ్ తదితరులున్నారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తాం



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా వ్యాపారులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను ఆదేశించారు. ఇందిరాపార్క్ నుంచి నాగమయ్యకుంట వరకు జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కాగా స్టీల్ బ్రిడ్జి డివైడర్ నిర్మిస్తుండటంతో పార్కింగ్ సమస్య వస్తుందని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, జవహర్‌నగర్ వ్యాపారుస్తుల విజ్ఞప్తి మేరకు బుధవారం ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. డివైడర్ నిర్మాణం వలన పార్కింగ్ సమస్య వస్తుందని, దీని ద్వారా తమ వ్యాపారాలు దెబ్బతింటాయని వ్యాపారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులకు పార్కింగ్ సమస్యను రాకుండా పరిష్కరించాలని ఎస్ఆర్‌డీపీ ఈఈ గోపాల్‌ను ఆదేశించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 5 చోట్ల యూటర్న్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, చిక్కడపల్లి ట్రాఫిక్ ఎస్సై పెంటాగౌడ్, స్థానిక వ్యాపారులు రమేశ్, గుండు జగదీశ్ బాబు, సత్యనారాయణ, రవి శంకర్‌గుప్తా, శ్రీకాంత్, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, అనిల్, తదితరులున్నారు.

మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీట

కవాడిగూడ: దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్ మసీద్‌లో కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్‌ల కార్పొరేటర్లు రచనశ్రీ, ఎ.పావనీవినయ్‌కుమార్‌లతో కలిసి ఆయన రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని పండుగలను ఎంతో గొప్పగా నిర్వహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్.డీ. సాయికృష్ణ, హనుమాన్ టెంపుల్ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ కవాడిగూడ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ అన్వర్, మహ్మద్ జమాలుద్దీన్ అహ్మద్, ఇస్మాయిల్, రాంచందర్, ఆర్.రాజేష్, బీజేపీ నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, శ్రీను, వినయ్‌కుమార్, ప్రభాకర్, దిలీప్‌యాదవ్ తదితరులున్నారు.



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి



బద్రుకా కాలేజీలో 'బిజ్‌కామ్' ను ప్రారంభించిన ఓయూ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్

కాచిగూడ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ అన్నారు. బుధవారం కాచిగూడలోని 'బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్'లో 'బిజ్‌కామ్ -2023' మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వ్యాపార, వాణిజ్య రంగానికి అవసరమయ్యే స్కిల్స్‌ను విద్యార్థులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. కేవలం పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానమే కాకుండా సాంకేతిక పరిజ్ఞాన్ని కూడా నేర్చుకోవాలన్నారు. ఉపాధి వెతుక్కోకుండా పది మందికి ఉపాధినిచ్చేలా విద్యార్థులు అవకాశాలను సృష్టించాలన్నారు. ప్రతి ఒక్కరిలో పోటీ తత్వం ఉండాలని, అప్పుడే పోటీల్లో విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. బద్రుకా కళాశాల గౌరవ కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, డాక్టర్ ఎం.జానకీరామ్, డాక్టర్ వెంకటయ్య, ఆశీష్ భూతాడ తదితరులున్నారు. జంటనగరాల్లోని 50కి పైగా కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాతశాలను ప్రదర్శించారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



అభినందిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సంజయ్‌కి దళిత రత్న అవార్డు రావడంపై ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్‌యాదవ్, టెంపుల్ జనార్దన్, కె.శ్రీకాంత్ తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గ్రహీతలను సన్మానిస్తున్న ఎంఎన్ శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దళిత రత్న అవార్డు పొందిన ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు సూచించారు. మహనీయుల జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు పొందిన అవార్డు గ్రహీతలకు బుధవారం రాంనగర్‌లోని దావత్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ, అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎన్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నూతనంగా నిర్మిస్తున్న సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారన్నారు. 125 అడుగుల నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తనకు మించిన అంబేడ్కర్ అభిమాని మరొకరు లేరని సీఎం కేసీఆర్ నిరూపించుకున్నారన్నారు. దళితుల సంక్షేమం కోసం దళితబంధు, ఇతర సంక్షేమ పథకాలను అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ కో- చైర్మన్ జంగ శ్రీనివాస్ దళిత రత్న అవార్డు గ్రహీతలను సన్మానించారు. దళిత రత్న అవార్డు గ్రహీతలు జి.శంకర్, లోకేష్, ఈ.రవీందర్, బాబురావు, హరినాథ్, శ్రీకాంత్, రాజు, లక్ష్మీపతితో పాటు బీఆర్ఎస్ నేతలు సయ్యద్ అస్లాం, బుచ్చి వెంకటేశ్వర్లు, నాగులు యాదవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్ సెక్టార్‌లోని అంజుమాన్ ఫంక్షన్ హాల్‌లో అడ్మిన్ ఎస్సై కె.సురేందర్, ఎస్సై ఎస్.స్వప్నల పర్యవేక్షణలో సైబర్ మోసాలు, సోషల్ మీడియాలో వచ్చే మోసపు ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వివరించారు.

రంజాన్ కానుకల పంపిణీ



పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: రంజాన్ పండుగను మతసామరస్యంతో ఐకమత్యంతో నిర్వహించుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో పేద ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలను ఆమె పంపిణీ చేశారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శ్రీకాంత్, కృష్ణప్రసాద్, సత్తిరెడ్డి, నవీన్‌కుమార్, శివకృష్ణ, రవీందర్, మహిళలు పాల్గొన్నారు.

షాట్ సర్క్యూట్‌తో మంటలు !

తప్పిన భారీ ప్రమాదం

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో షాట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్న ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్‌లోని సదానంద్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లోని మూడో ఫ్లోర్‌లో ఉంటున్న సాయిప్రశాంత్ తండ్రి అస్తమా కారణంగా అక్సిజన్ నెబ్లైజర్ వాడుతుండగా.. అకస్మికంగా మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు వెంటనే ఫైర్ ఇంజిన్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, నందకిషోర్‌యాదవ్, సుభాష్ పటేల్, శీర్‌సాగర్, భీమ్‌రాజ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ ఫైర్ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



ఘటనా స్థలాన్ని సందర్శించిన కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ తదితరులు

నేడు 'సుందరధామ్' ఆశ్రమానికి చినజీయర్ స్వామి

చిక్కడపల్లి: సుందరకాండ ఎం.ఎస్.రామారావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని చిలుకూరు మార్గంలో రెడ్డివారిపల్లి వద్ద ఉన్న సుందరధామ్ ఆశ్రమంలో ఈరోజు సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు సుందరకాండ పారాయణ ముగింపు కార్యక్రమానికి జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని సమాచారం. జీయర్ స్వామి ఆంజనేయస్వామి వారికి పూజలు చేస్తారని ట్రస్ట్ చైర్మన్ సుందరదాసు డాక్టర్ పి.శ్రీనివాస స్వామి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పారాయణ అనంతరం భోజన ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కాచిగూడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం బర్కత్‌పుర, భూమన్నలేన్‌లో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని మురుగు రోడ్లపై పారుతుందని కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లాల్ దినేసిల్, తిరుపతి, నరేందర్, వెంకటరమణ, సాయి, అనిల్ అరోరా, సుభాష్ పటేల్, మురళి, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, సూరి, నాగు తదితరులున్నారు.



కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

47 దేశాలలో అంబేడ్కర్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచంలో 47 దేశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు జరిగాయని శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధిస్తామనే సంకల్పంతో అంబేడ్కర్ ముందుకు వెళ్లారన్నారు. అంబేడ్కర్ సేవలను గుర్తించి దేశంలో తొలిసారి ఓయూ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం చరిత్రలో నిలిచిపోయిందన్నారు.

వీసీ శ్రీనివాస్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

కవాడిగూడ: ఖమ్మంలో జరిగిన ఇఫ్తార్ విందులో తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడాల శ్రీనివాస్ ప్రసంగాన్ని కొంత మంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని ఇలాంటి ప్రచారాన్ని తక్షణమే మానుకోకపోతే న్యాయ పోరాటం చేస్తామని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో అనేక మంది అధికారులు గొప్ప హోదాలో ఉండి సీఎం, మంత్రులతో చనువుగా వ్యవహరించిన వారిపై దుష్ప్రచారం చేయలేదన్నారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలను మానుకోకపోతే భవిష్యత్తులో విమర్శించే వారు న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ప్రసాద్

ముషీరాబాద్: ఈ నెల 25న జరిగే ముషీరాబాద్ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి విజయవంతం చేయాలని ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు కె.నర్సింగ్‌ప్రసాద్ సూచించారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని వాడవాడలా పార్టీ జెండాల ఆవిష్కరణ, ర్యాలీలు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పింగళి వెంకయ్యహాల్‌లో జరిగే ఈ సమావేశానికి బైక్ ర్యాలీగా తరలివెళ్లాలన్నారు. డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ యువజన కమిటీ అధ్యక్షుడు సదా, నాయకులు ఎయిర్‌టెల్ రాజు, జి.గోవింద్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, పరుశరాంయాదవ్ తదితరులున్నారు.

దేశంలోనే హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు

కాచిగూడ: హైదరాబాద్ ప్రాంతమంటే దేశంలోనే ఓ ప్రత్యేకమైన గుర్తింపు కలిగి ఉందని భిన్న మతాలకు, కులాలకు పెట్టిందిపేరని సీపీఐ నేతలు అన్నారు. ' ప్రజలను విచ్ఛిన్నం చేస్తూ.. రెండు పార్టీలు మతం పేరుతో ఓట్లు దండుకుంటున్నాయని' సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలు ఆలోచించి 'బీజేపీ, ఎంఐఎం చేస్తున్న మత రాజకీయాలను తరిమి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు'. 'బీజేపీ హటావో భారత్ బచావో' అనే నినాదంతో సీపీఐ పార్టీ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన ఎంఐఎం పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరింప చేయడంలో బీజేపీ పాత్ర ఉందని ఆరోపించారు. బుధవారం కాచిగూడలో ఇంటింటికీ తిరుగుతూ.. సీపీఐ బలోపేతానికి సహకరించాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగాలను మొత్తం ప్రైవేటీకరణ చేస్తుంటే ఎంఐఎం పార్టీ బీజేపీకి బీ టీంగా పనిచేస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎంఐఎం పార్టీలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని బ్రతికించాలన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి: వాసిరెడ్డి సీతాదేవి స్త్రీ సమస్యలపై సంపూర్ణ అవగాహనతో మార్క్సిజం దృక్కోణంలో రచనలు చేశారని తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు ఆచార్య ఆవుల మంజులత అన్నారు. బుధవారం రాత్రి శ్రీ త్యాగరాయగాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవీ వంశీ గ్రంథాలయం వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహణలో వాసిరెడ్డి సీతాదేవి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ రచయిత కామేశ్వరికి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. స్త్రీ స్వేచ్ఛ ఆత్మగౌరవం వంటి అంశాల కథా వస్తువులుగా సీతాదేవి కామేశ్వరి గ్రహించారన్నారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం, వాసిరెడ్డి నారాయణరావు, వంశీ రామరాజు, డాక్టర్ సుధలు పాల్గొన్నారు.



కామేశ్వరికి పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

కులగణనకు అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

కాచిగూడ: జనగణనలో కులగణనకు కేంద్ర ప్రభుత్వంపై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కోరారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 70 కోట్ల మంది బీసీలు, ప్రధాన రాజకీయ పార్టీలు కులగణనను డిమాండ్ చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదన్నారు. కులాల వారీగా జనాభా లెక్కలు ఉంటేనే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు సాధ్యమవుతుందన్నారు. కులగణనకు అంగీకరించకుంటే వచ్చే ఎన్నికలలో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బీసీ మహాసభ నేతలు నేమూరి సాంబశివ గౌడ్, డాక్టర్ ప్రశాంత్, నిమ్‌కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, అలీం, రవి, అనిల్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్

పాడి రైతులకు అవగాహన సదస్సు

ముషీరాబాద్: విత్తనాల నాణ్యతను మెరుగుపరిచేందుకు రైతుల ఆదాయాన్ని పెంచడానికి విత్తన ఉత్పత్తి, మార్కెటింగ్‌లలో వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిపాలన నియంత్రణలో ఉన్న నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ పని చేస్తుందని ఎస్ఎఫ్ఏసీ డైరెక్టర్ నటాబర్‌పాల్ తెలిపారు. బుధవారం సీజీఓ టవర్స్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాడి రైతులకు, ఎఫ్‌పీఓలకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లలో ఉన్న సబ్సిడీలు వాటి వల్ల ఎఫ్‌పిఓలకు చేకూరే లాభాలను పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌కుమార్, సీనియర్ జనరల్ మెనేజర్ కుల్‌దీప్‌సింగ్‌లు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఎఫ్‌పీఓ సంఘాల నుంచి 100 మంది ప్రతినిధులు, పాడి రైతులు హాజరయ్యారు. ప్రోగ్రామ్ ఏరియా మెనేజర్ బి.శరత్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజినల్ మేనేజర్ ఏ.బ్రిటో, శివకుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఏసీ డైరెక్టర్ నటాబర్‌పాల్

హుస్సేన్‌సాగర్ నాలా పూడికతీత పనుల పరిశీలన



నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: రాబోయే వర్షాకాలం నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ నాలా పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అధికారులకు సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని సుభాష్‌చంద్రబోస్‌నగర్ వద్ద జరుగుతున్న నాలా పూడికతీత పనులను మున్సిపల్ డీఈ సన్నీ, ఏఈ సుభాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి ఆమె పరిశీలించారు. నాలా పూడికతీతలో తొలగించిన మట్టిని ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. తద్వారా ప్రజల ఇబ్బందులను తొలగించినట్లు అవుతుందన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, జి.వెంకటేష్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

దేవాలయాన్ని సందర్శించిన అధికారుల బృందం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ముషీరాబాద్ చౌరస్తాలోని చరిత్రాత్మక సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు సందర్శించారు. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే మంత్రి తలసాని ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు.దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామక్రిష్ణ, ఇంజినీర్ శర్మ, స్తపతి జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప, ఈవో రాజేష్ తదితరులు దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం లోపల, బయట దుకాణాల సముదాయాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారిలో ఎంతో చరిత్ర కలిగిన దేవాలయాన్ని అత్యంత అద్భుతంగా నిర్మించడంతో పాటు ప్రాంగణంలో ఉన్న దుకాణాల సముదాయాన్ని పునర్నిర్మాణం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారని అధికారులు తెలిపారు. త్వరలో రెవెన్యూ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే చేపడుతామన్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాల యజమానులకే నిర్మాణం తర్వాత వారికే కేటాయిస్తామని నిర్మాణాలకు సహకరించాలని పవన్‌కుమార్ గౌడ్ కోరారు. వారి వెంట నాయకులు వెంకట్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, పిట్ల ప్రతాప్ పాల్గొన్నారు.



దేవాలయాన్ని సందర్శించిన అధికారుల బృందం